భద్రాచలం ఆలయాభివృద్ధికి భూసేకరణపై గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ఆలయం చుట్టూ అవసరమైన భూసేకరణకు స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ రాహుల్, ఆర్డీఓ దామోదర్‌రావు, తహసీల్దారు శ్రీనివాస్, దేవస్థానం ఈఓ రమాదేవి, డీఎల్‌పీఓ సుధీర్ హాజరయ్యారు. ఆర్డీఓ దామోదర్‌రావు మాట్లాడుతూ ఆలయ చుట్టుపక్కల ఇళ్ల యజమానులతో గురువారం సమావేశమై ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాలు తెలిపామన్నారు. దీనిపై సందేహాలు, సమస్యలుంటే పీఓకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు. సభకు హాజరైన పలువురు మాట్లాడుతూ తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, బాధితులకు న్యాయం చేయాలని తమ వాదనలు వినిపించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుండు శరత్ మాట్లాడుతూ నిర్వాసితులకు స్పష్టమైన హామీ, ప్యాకేజీని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గుడి చుట్టూ ఉన్న వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపి భూమిని సేకరించాలని సీపీఎం నాయకుడు నర్సారెడ్డి కోరారు. ఆలయ అభివృద్ధి కోసం నిర్వహించిన గ్రామసభకు భారాస వ్యతిరేకం కాదని, బొమ్మల దుకాణాల వారినీ ఆదుకోవాలని ఆపార్టీ నాయకులు మానె రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఇంతకాలం నిలిచిపోయిన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి కృషి చేస్తోందని, ప్రజలు సహకరించాలని ఆపార్టీ నాయకుడు సరేళ్ల నరేశ్ కోరారు.

ఈసారైనా దిశానిర్దేశం చేస్తారా..?

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుపై జిల్లాలో పర్యవేక్షణ కొరవడుతోంది. ఏటా సాధించాల్సిన లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ఈ పరిస్థితిని గాడిన పెట్టాల్సిన పాలనా యంత్రాంగం ఒక 'దిశ' లేకుండా ముందుకు సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు పది నెలల విరామం తర్వాత నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో 'దిశ' కమిటీ సమావేశమవుతోంది. కనీసం తీర్మానాంశాల అమలుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

2020లో జరిగిన సమావేశంలో సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి 72 అంశాలపై తీర్మానం చేశారు. ఆయా లక్ష్యాల సాధనపై పెద్దగా దృష్టిసారించిన దాఖలాల్లేవు. ఆ తర్వాత కరోనా విజృంభణతో రెండేళ్ల పాటు కమిటీ సమావేశమవలేదు. తిరిగి 2022 నవంబరు 26న సమావేశం నిర్వహించారు. అంతకుముందు తీర్మానాలకు సంబంధించి పలు సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు శాఖల వారీ లెక్కలు చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు వాడీవేడి చర్చకు తెరలేపారు. చివరిసారిగా 2024 జనవరి 25న అప్పటి మహబూబాబాద్ ఎంపీ మాళోత్ కవిత అధ్యక్షతన దిశ కమిటీ సమావేశమైంది. 42 అంశాలపై ప్రగతి నివేదికలను వివిధ శాఖల అధికారులు పొందుపరిచారు. తదనంతరం జరిగిన చర్చలో పలు పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధులు పెదవి విరిచారు. వారు లేవనెత్తిన సమస్యలపై పెద్దగా స్పందన లేదని విమర్శలు గుప్పించారు. ప్రధానంగా రైల్వే శాఖపై జరిగిన చర్చలో ఇల్లెందులో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. దీనిపై ఎలాంటి స్పందన లేదు. వైద్యారోగ్య శాఖలో అప్పటి నుంచి ఇప్పటివరకు మందుల కొరత వేధిస్తూనే ఉంది. డయాలసిస్ కేంద్రాలను పెంచాలన్న లక్ష్యంలో కొంత పురోగతి కనిపించినా.. రక్త శుద్ధి సేవలకు కిడ్నీ రోగులు నిరీక్షిస్తూనే ఉన్నారు. మరిన్ని యూనిట్లు పెంచితే తప్ప ఊరట కలిగేలా లేదు. ఏజెన్సీలో వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీపైనా గతంలో చర్చ లేవనెత్తారు. దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాల జారీ ఓ ప్రహసనంగా మారింది. దీనికి సరైన పరిష్కారం చూపాల్సి ఉంది. పీఎం గ్రామీణ సడక్ యోజన, గిరివికాస్ పథకం, మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం, ఏజెన్సీల్లో సెల్‌టవర్ల ఏర్పాటు ద్వారా నెట్‌వర్క్ విస్తరించాలనే అంశాలపై మరింత దృష్టిసారించాలనే డిమాండ్ ప్రస్తుతం కూడా వినిపిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను పథకాల అమలుతో పటిష్ఠపరచాలని మన్యం ప్రజలు కోరుతున్నారు.



మరో ఐదు యూనిట్లు పెంచాల్సిన కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం

మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం

జిల్లా దిశ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అధ్యక్షతన శనివారం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, సదుపాయాల కల్పన తీరుపై సమీక్షించనున్నారు. శాఖల వారీగా సమగ్ర సమాచారంతో అధికారులు హాజరుకానున్నారు. గత సమావేశంలో రైల్వే అధికారులు అసమగ్ర సమాచారంతో హాజరవటంపై అసంతృప్తి వ్యక్తమైంది. ఇలా తూతూమంత్రంగా కాకుండా జిల్లా అభివృద్ధికి బాటలు వేసే నిర్మాణాత్మక చర్చలో అధికారులను భాగస్వాములు కావాలన్నది ప్రజలు, ప్రజాప్రతినిధుల ఆకాంక్ష. ఇటీవల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీ కాలం పూర్తయినందున వారు సమావేశానికి హాజరయ్యే అవకాశం లేదు. ఖమ్మం లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

మినీ డిగ్రీ.. సత్వర ఉపాధి..!

సంప్రదాయ డిగ్రీ కోర్సుల తీరుతెన్నులు వేగంగా మారుతున్న తరుణంలో విద్యార్థులకు అపారమైన ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఓవైపు డిగ్రీ విద్యనందిస్తూనే మరోవైపు జాబ్ గ్యారంటీ కోర్సులకు ప్రాధాన్యమిస్తోంది.

- ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే



ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలకు చోటు

ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 38 కళాశాలల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) విభాగాల్లో కోర్సులను ప్రవేశపెట్టింది. వీటిలో 20 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 18 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)కి చోటు దక్కింది. డిగ్రీ పూర్తి చేసిన వెంటనే బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో త్వరలో శిక్షణ మొదలవుతుంది.

రాష్ట్రవ్యాప్తంగా 10వేల మందికి ఉచిత శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా 10వేల మంది విద్యార్థులకు బీఎఫ్ఎస్ఐ విభాగాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తారు. దీని కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందిస్తోంది. ఈపోర్టల్‌లో కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదైన విద్యార్థులను బీఎస్ఎఫ్ఐ కంపెనీలు వీడియో కాల్ ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయి. గత నెల 25న సీఎం రేవంత్‌రెడ్డి బీఎఫ్ఎస్ఐ కోర్సును ప్రారంభించారు.

త్వరలో ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో బీఎస్ఎఫ్ఐ కోర్సులకు సంబంధించిన శిక్షణ మొదలవుతుంది. ఈ అవకాశాన్ని డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.



- డా.మహ్మద్ జకీరుల్లా, ప్రిన్సిపల్, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ప్రత్యేకతలివీ..

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల విద్యార్థులు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు.
- రాష్ట్రంలో న్యాక్ ఏ++ 3.64 సీజీపీఏ కలిగిన ఏకైక కళాశాలగా ప్రత్యేకత కలిగి ఉంది.
- ఇక్కడ 45 యూజీ కోర్సులు, తొమ్మిది పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- యూజీలో 4,800 మంది, పీజీ కోర్సుల్లో 800 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది.
- ఎప్పటికప్పుడు నూతన పాఠ్యప్రణాళికలు, విద్యార్థి కేంద్రంగా నైపుణ్య కార్యక్రమాలు రూపొందిస్తుండటంతో పాటు ఏజెన్సీ, గ్రామీణ, పట్టణ, నగర విద్యార్థులు విద్యనభ్యసించేందుకు 'మినీ విశ్వవిద్యాలయం'గా పేరు గాంచింది.

బీఎస్ఎఫ్ఐ కోర్సును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈక్రమంలో ఇక్కడి అధ్యాపకులకు తొలుత శిక్షణ ఇవ్వనుంది. అనంతరం కోర్సు ప్రారంభమవుతుంది. తద్వారా డిగ్రీ తృతీయ సంవత్సరం పూర్తిచేసుకునే సమయానికి 'మినీ డిగ్రీ'గా బీఎస్ఎఫ్ఐ ఉపయోగపడుతుంది.



- డా.రమాసత్యవతి, ఐక్యూఏసీ సమన్వయకర్త



ఠాణాలో మొక్క నాటుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

పోలీస్ శాఖపై విశ్వసనీయత పెంచాలి: ఎస్పీ రోహిత్ రాజ్

టేకులపల్లి, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో తగిన చర్యలు తీసుకుంటూ శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంచాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. సర్కిల్‌కు సంబంధించిన అన్ని అంశాలపై డీఎస్పీ చంద్రభాను, సీఐ తాటిపాముల సురేశ్‌తో సుమారు ఐదు గంటల పాటు విస్తృతంగా చర్చించారు. ఠాణాలకు వచ్చే బాధితులకు వెంటనే న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి, బోడు, ఆళ్లపల్లి ఎస్.ఐ.లు పోగుల సురేశ్, పొడిశెట్టి శ్రీకాంత్, రతీశ్ పాల్గొన్నారు.

రాములోరికి స్వర్ణ కవచాల అలంకారం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవడంతో వీక్షించిన భక్తులు మురిసిపోయారు. ఈ రూపంలో ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించిన తీరు మంత్రముగ్ధులను చేసింది. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక అమితానందకరంగా సాగాయి. దర్బారు సేవ భక్తుల్లో తన్మయత్వాన్ని నింపింది. సినీనటుడు సుమన్ రాములవారిని దర్శించుకున్నారు. ఆయనకు పీఆర్వో సాయిబాబా సాదర స్వాగతం పలకగా వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకున్నారు.





రామయ్యను దర్శించుకున్న సినీ నటుడు సుమన్

లెక్కలేనితనం..!



నేలకొండపల్లి మండలం చెరువుమాదారం చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న అధికారులు, తదితరులు

ఈటీవీ, ఖమ్మం: చెరువులు, కుంటలు, జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ సమయంలో చేపపిల్లలను పోస్తే ఎదుగుదల బాగుంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చేపపిల్లల విడుదల ప్రక్రియ సుమారు రెండు నెలలు ఆలస్యమైంది. మత్స్య శాఖ అధికారుల ఉదాసీనత, గుత్తేదారుల ఇష్టారాజ్యంతో అసలు లక్ష్యం నీరుగారుతోంది.

ఆరంభశూరత్వమేనా..?

ఈ ఏడాది ఖమ్మం జిల్లాలోని 864 చెరువుల్లో 1.75 కోట్లు, భద్రాద్రి జిల్లాలోని 743 చెరువుల్లో 88 లక్షల చేపపిల్లలను విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గతం కన్నా సుమారు 50శాతం లక్ష్యం తగ్గింది. గతంలో జూన్, జులైలో సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఆగస్టు నాటికి చేపపిల్లల విడుదల కార్యక్రమం పూర్తయ్యేది. గుత్తేదారులు పాత బకాయిల విడుదల కోసం పట్టుబట్టడంతో ఈఏడాది టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. ఈనెల 4న ఉభయ జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అట్టహాసంగా చేపపిల్లలను చెరువులు, జలాశయాల్లో విడుదల చేశారు. ఆతర్వాత ఎక్కడా సందడి కనిపించటం లేదు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 35చెరువుల్లో 11.62 లక్షల చేపపిల్లలను మాత్రమే వదిలారు. వీటిలో 35-40 ఎంఎం చేపపిల్లలు 3.50లక్షలు, 80-100 ఎంఎం చేపపిల్లలు 8.12లక్షలున్నాయి. భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో కేవలం లక్ష చేపపిల్లలను విడుదల చేశారు. ఆతర్వాత ఎక్కడా ప్రక్రియ సాగలేదు.

ఇష్టారాజ్యంగా చేపపిల్లల విడుదల

అసలే అంతంతమాత్రంగా సాగుతున్న చేపపిల్లల పంపిణీ ప్రక్రియలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేపపిల్లలను వదులుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వాస్తవానికి చేపపిల్లల విడుదల సమయంలో అధికారులు, మత్స్యకారుల సమక్షంలో వాటి సైజు, సంఖ్య లెక్కించాలి. అయితే ఎక్కడా ఈ ప్రక్రియ సాగటం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నేలకొండపల్లి మండలం బాలసముద్రం, చెరువుమాదారం, కట్టలమ్మ చెరువుల్లో చేపపిల్లలను శుక్రవారం వదిలారు. ఉదయం నుంచి మత్స్యకారులు ఎదురుచూసినా చేపపిల్లలు రాలేదు. తీరా అందరూ వెళ్లాక హడావుడిగా ఒకరిద్దరు అధికారులు వచ్చి చేపపిల్లలను వదలటం గమనార్హం. బాలసముద్రం చెరువులో 81వేల చేపపిల్లలు వదిలినట్లు లెక్కలు చూపారు. వాస్తవానికి 3 లక్షల చేపపిల్లలు పోయాల్సిన చెరువులో 81వేలకే పరిమితమవటమేంటని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపపిల్లల సైజు, సంఖ్య లెక్కించకుండానే వాటిని చెరువుల్లో వదలటమేంటని ప్రశ్నిస్తున్నారు. మత్స్య శాఖ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం నడుపుతున్నారని మండిపడుతున్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు చేపపిల్లల విడుదల ప్రక్రియ జరుగుతుంది. చేపపిల్లల సైజు, సంఖ్యలో తేడాలు లేకుండా చూస్తున్నాం. గతం కన్నా ఈసారి పెద్దసైజు చేపపిల్లలను విడుదల చేస్తున్నాం.

- శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఖమ్మం

ఎంపిక చేసిన చెరువుల్లో వదులుతున్న చేపపిల్లలకు, అసలు లక్ష్యానికి పొంతన కుదరట్లేదు. కొన్నిచోట్ల మత్స్యకారులకు సమాచారమివ్వకుండానే చెరువుల్లో పోస్తున్నారు. చేపపిల్లల విడుదల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా మంత్రులు చొరవ చూపాలి.

- మైసా శంకర్, మత్స్యకార సంఘం నాయకుడు, నేలకొండపల్లి

నేడు న్యాయవాదులకు అవగాహన సదస్సు

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: నూతన చట్టాలపై ఐలూ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని కోర్టు న్యాయవాదుల గ్రంథాలయంలో శనివారం సదస్సును నిర్వహించనున్నారు. సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభించనున్నట్లు ఐలూ బాధ్యులు రమేశ్‌కుమార్ మక్కడ్ శుక్రవారం తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం కోర్టులకు చెందిన ప్రముఖ న్యాయవాదులు నూతన చట్టాల్లోని ప్రధానాంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కె.సత్యనారాయణ 'న్యాయవాదుల సమస్యలు' అనే అంశంపై ప్రసంగిస్తారని చెప్పారు.

మునగ సాగుతో ఎకరాకు రూ.లక్ష ఆదాయం: కలెక్టర్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: మునగ సాగుతో ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని, రైతులందరికీ దీనిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సాగవుతున్న పంటలు, నర్సరీలు, మొరింగా ప్లాంటేషన్, అజోల్ల, కెనాల్ బండ్ ప్లాంటేషన్, చేపల పెంపకంపై కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రైతులు ఎక్కువగా వరి, పత్తి సాగుపైనే ఆసక్తి చూపుతున్నారన్నారు. పంట మార్పిడిపై దృష్టిసారించేలా ప్రోత్సహించాలని సూచించారు. మునగ సాగు విధానంలో కాయలకే కాకుండా మునగాకు పొడికి బహిరంగ మార్కెట్లో కిలోకు రూ.వెయ్యి ధర లభిస్తుందని తెలిపారు. ఎండిన గింజల నుంచి తీసే నూనెకు రూ.3 వేల చొప్పున ఆదాయం వస్తుందన్నారు. కేవలం రూ.10 వేల పెట్టుబడితో కనీసం రూ.లక్ష వరకు నికరాదాయం లభిస్తుందని చెప్పారు. తొలి విడతలో జనవరి నెలలో జిల్లాలో 10 వేల ఎకరాల్లో తోటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వివరాలు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలు..

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కోర్సులను (ఏటీసీ) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. ఉపాధి కల్పన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఐటీఐల ప్రిన్సిపాళ్లు, విద్యా శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఐటీఐల్లో ఏటీసీ కేంద్రాలను ప్రవేశపెట్టి.. మ్యానుఫ్యాక్చరింగ్-ప్రాసెసింగ్, కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైడ్ కోర్స్, అడ్వాన్స్ సీఎన్సీ మెషినింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఆపై విద్యార్హత ఉన్న వారు https//iti.telangana.gov.in వెబ్‌సైట్‌కు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95332 86852 నంబరును సంప్రదించాలన్నారు. రుద్రంపూర్, మణుగూరు ఐటీఐల్లో ఏటీసీ నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఐటీఐ జాయింట్ డైరెక్టర్ నగేశ్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నర్సయ్య, ఐటీఐల ప్రిన్సిపాళ్లు రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అయ్యో రామా.. ఎన్నాళ్లిలా..?

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాధికారులు, ఉద్యోగుల మధ్య అగాధం ఏర్పడుతోంది. అధికారుల నిర్ణయాలు సరిగ్గానే ఉంటాయంటున్నా.. కొన్నిసార్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలకు సిబ్బంది సరిపడా లేరనే కారణంతో గురువారం కొన్ని గంటల పాటు తాళాలు వేసి ఉంచటం వివాదాస్పదమైంది. సర్దుబాటు చేసే పరిస్థితి ఉన్నా కావాలనే కొందరు ఉద్యోగులు ఈ తతంగం నడిపించారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈవిషయంపై అదేరోజు సాయంత్రం ఈఓ రమాదేవి తమ ఉద్యోగులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశ క్రతువును వీడియో తీయించారంటే ఇక్కడ నెలకొన్న అపనమ్మకాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ధర్మకర్తల మండలి ఏర్పడితే పాలకవర్గ సభ్యులు చొరవ తీసుకునే వీలుంటుంది. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా ప్రభుత్వంతో చర్చించవచ్చుననే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఆశావహులు ప్రయత్నిస్తున్నప్పటికీ 2013 తర్వాత ఆలయ ధర్మకర్తల మండలి ఊసెత్తకపోవటం గమనార్హం.



భద్రాచలం రామాలయం

అభివృద్ధిపై అడుగు పడాలంటే..

రామాలయ అధికారులు చురుగ్గా వ్యవహరిస్తుండటంతో గతేడాది రూ.80కోట్లు ఉన్న ఆదాయం ఈసారి రూ.100 కోట్లకు చేరుకునే వీలుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రూ.60.20 కోట్లు కేటాయించింది. గ్రామసభలను ఏర్పాటు చేస్తోంది. రూ.కోటితో కల్యాణ మండపం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో వివాదాలు తగవని భక్తులు చెబుతున్నారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాస్తవాలను తెలుసుకోవాల్సి ఉంది. సమన్వయ లోపం తలెత్తకుండా ఈఓతో పాటు వైదిక బృందం చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు.

కలహాలు తీరేనా..?

- ☆ ఇటీవల ఆలయ ప్రధానార్చకుడు, అతడి కుమారుడు కుటుంబ కలహాలతో రచ్చకెక్కాల్సి వచ్చింది. వీరిద్దరిపై కేసు నమోదు కావటంతో సస్పెండయ్యారు.
- ☆ ఇటీవల ఇద్దరు వైదిక పెద్దలు దసరా ఉత్సవాలకు తిరుపతి వెళ్లి ప్రవచనాలిచ్చారు. సెలవు తీసుకోకుండా ఎలా వెళ్తారని వీరికి ఈఓ మెమోలు జారీ చేశారు.
- ☆ ఓ అర్చకుడు ఇక్కడ విధులకు హాజరవకుండా వేరే దేశం వెళ్లారు. అతడిని విధుల నుంచి తొలగించారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా ఆస్థాయిలో పోస్టులను భర్తీ చేయటం లేదు.
- ☆ ఇక్కడి అవసరాల నిమిత్తం సిబ్బంది సంఖ్య పెంచాలి. 36 మంది వైదిక సిబ్బంది సేవలందించాల్సి ఉంది. పరిచారక పోస్టులను భర్తీ చేయకపోవటంతో తీర్థప్రసాదాల పంపిణీ భారంగా మారుతోంది.
- ☆ ఈతరహా సమస్యలకు మూలాలు తెలిసిన వైదిక పెద్దలు వీటిని పరిష్కరించేందుకు చొరవ చూపటం లేదు. గొడవలు వచ్చినా అంతర్గత ఆలయాలను మూసే పరిస్థితి రాకుండా చూడాలి.

క్రీడలతో మానసిక ఉల్లాసం: పీవో రాహుల్

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల కోసం జిల్లా స్థాయి ఎంపికలను పాల్వంచ మండలం కిన్నెరసాని మోడల్ క్రీడా పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం పీవో మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు పోరాట పటిమను అలవర్చుతాయన్నారు. వారిలో శారీరక దృఢత్వం మెరుగవుతుందన్నారు. ఏడు డివిజన్ల నుంచి వచ్చిన విద్యార్థులు మంచి ప్రతిభ చూపాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న రాష్ట్ర క్రీడా పోటీల్లో భద్రాచలం ఐటీడీఏ నుంచి అత్యధిక పతకాలు సాధించాలన్నారు. శుక్రవారం బాలికల కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ లీగ్ పోటీలను పీడీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, క్రీడల అధికారి గోపాలరావు, అదనపు క్రీడల క్రీడల అధికారులు వెంకటనారాయణ, రాంబాబు, నాగేశ్వరరావు, ఏటీడీవోలు చంద్రమోహన్, జహీరుద్దీన్, అశోక్‌బాబు, ప్రధానోపాధ్యాయులు రామారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న ఐటీడీవో పీవో రాహుల్

అభయారణ్యాన్ని సందర్శించిన శిక్షణ ఎఫ్‌బీవోలు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కిన్నెరసాని అభయారణ్యాన్ని దూలపల్లి అటవీ శాఖ అకాడమీకి చెందిన 33 మంది శిక్షణ ఎఫ్‌బీవోలు శుక్రవారం సందర్శించారు. అభయారణ్యం విశేషాలను వారు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాల గురించి ఎఫ్‌డీవో బాబురావు వివరించారు. అనంతరం మందరికలపాడు ప్లాంటేషన్‌ను అకాడమీ బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో రేంజర్ కవితా మాధురి, వంశీకృష్ణ, ఎఫ్ఎస్‌వో కిషన్, ఎఫ్‌బీవో రాములు తదితరులు పాల్గొన్నారు.


మొక్కల సంరక్షణ వివరాలు తెలుపుతున్న రేంజర్ వంశీకృష్ణ

ఆన్‌లైన్‌లో నమోదుతో.. ఇసుక పొందండిలా..

చర్ల, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

జిల్లాలో మన్యంలో గిరిజన సొసైటీ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక అమ్మకాలు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రారంభమయ్యాయి. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గోదావరి ఇసుక రీచ్‌ల ద్వారా టీఎస్ఎండీసీ (తెలంగాణ స్టేట్ మినరల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్) సమక్షంలో ఇసుక డంపింగ్ పాయింట్ల నుంచి ఈ అమ్మకాలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వినియోగదారులు బుక్ చేసుకున్న ఇసుకను లారీల ద్వారా తరలిస్తున్నారు.


పెద్దిపల్లి డంపింగ్ పాయింట్ నుంచి లారీకి లోడ్ చేస్తున్న ఇసుక

పెద్దిపల్లి రీచ్ నుంచి..

చర్ల మండల పరిధిలోని పెద్దిపల్లిలో 'పెద్దిపల్లి మహిళా ట్రైబల్ సొసైటీ' ద్వారా తవ్వకాలు జరిపిన ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేసుకున్న వారికి ఇసుకను విక్రయిస్తున్నారు. ఇక్కడి డంపింగ్ పాయింట్‌లో 50వేల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉంది. క్యూబిక్ మీటరు (టన్నున్నర)కు ప్రభుత్వ నిర్దేశిత ధర రూ.600 డీడీ ద్వారా చెల్లించి వినియోగదారులు ఇసుకను కొనుగోళ్లు చేస్తున్నారు. టీఎస్ఎండీసీ, సొసైటీ సభ్యుల సమక్షంలో ఈ అమ్మకాలు జరుగుతున్నాయి.

ప్రారంభమైన డీసిల్టింగ్..

సీతమ్మసాగర్ ప్రాజెక్టు పరిధిలోని చర్ల మండలంలోని జీపీపల్లి పంచాయతీలోని వీరాపురంలోని సర్వే నంబరు 23లో, జీపీపల్లిలోని సర్వే నంబరు 50లో 9.13 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను డీసిల్టింగ్ ద్వారా వెలికితీసే పనులు ఈనెల 7న పునఃప్రారంభమయ్యాయి. మూడు నెలల కిందట ఇక్కడ డీసిల్టింగ్ పనులు ప్రారంభమై అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ పనులు తిరిగి ప్రారంభం కాగా గతంలో డంపింగ్ పాయింట్‌లో నిల్వ చేసిన 10వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అమ్మకాలను టీఎస్ఎండీసీ ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియలో విక్రయిస్తున్నారు. ✦ దుమ్ముగూడెం మండలం నందులచెలక గ్రామంలోని చాముండేశ్వరి మహిళా గిరిజన సొసైటీ ఆధ్వర్యంలోనూ ఇసుక అమ్మకాలు సాగుతున్నాయి. 30వేల క్యూబిక్ మీటర్ల మేర ఇసుక నిల్వ ఉంది. ఆన్‌లైన్ ప్రక్రియలో అమ్మకాలు చేస్తున్నారు.

బుకింగ్ ఇలా..

✦ టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎంఎంఎస్ (శాండ్ సేల్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) పోర్టల్ ద్వారా ఇసుకను ఆన్‌లైన్ విధానంలో బుక్ చేసుకోవాలి. తొలుత sand.telangana.gov.in పోర్టల్‌ను సందర్శించి కస్టమర్ రిజిస్ట్రేషన్‌ను ఎంచుకోవాలి. మొబైల్ నంబరు నమోదు ద్వారా వచ్చే ఓటీపీని ఎంటర్ చేసి రిజిస్ట్రేషన్ ఫారంలో పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్ చెల్లింపు అనంతరం రసీదును పొంది దానిని డౌన్‌లోడ్ చేసుకోవాలి.

✦ ఎస్ఎస్ఎంఎంఎస్ వెబ్ పోర్టల్ ద్వారా ఇసుక డెలివరీ, వాహన రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. వాహనం(లారీ, ట్రాక్టర్) ఉన్న వారు వెబ్‌పోర్టల్‌లో తమ ఖాతాను నమోదుచేసుకోవచ్చు. ఎస్ఎస్ఎంఎంఎస్ తెలంగాణ పోర్టల్‌లో అంతర్రాష్ట్ర ఆర్డర్ ఐడీని నమోదు చేసుకొని కూడా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చు. ఇసుక బుకింగ్ కోసం హెల్ప్‌లైన్ నంబరు 040-233323150లో సలహాలు తీసుకోవచ్చు.

✦ సైట్‌లోకి వెళ్లి ఇసుక డెలివరీ పాయింట్‌ను సెలక్ట్ చేసుకోవాలి. ఇసుక రవాణా కోసం వినియోగించే వాహనం తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. డంపింగ్ పాయింట్ నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు అమ్మకాల ప్రక్రియ సాగుతుంది. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్దేశిత ధరతో ఇసుక అమ్మకాలు సాగుతాయి.

కెమెరాలకు చిక్కని చిరుతపులి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు అటవీ రేంజి పరిధిలో సంచరిస్తున్న చిరుతపులి కోసం అటవీ శాఖ అధికారులు గాలిస్తున్నారు. ఇప్పటి వరకు దాని పాదముద్రలు తప్ప పులి జాడ కనిపించలేదు. ఎర్రగుట్ట పరిసర ప్రాంతాల్లో ఇది సంచరిస్తూ ఉండవచ్చని అటవీ అధికారులు భావిస్తున్నారు. పులి కదలికలపై నిఘా పెట్టిన సిబ్బంది నాలుగు రోజుల క్రితం శునకాన్ని లాక్కెళ్లిన ప్రాంతాల్లో రెండు కెమెరాలను సైతం అమర్చారు. వాటిని శుక్రవారం పరిశీలించారు. కానీ ఎలాంటి దృశ్యాలు నమోదు కాలేదని అటవీ రేంజి అధికారి ప్రసాదరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సమీపంలో రెండు, మూడు పెద్దగుట్టలు ఉండటంతో పైకి వెళ్లి ఉండవచ్చని పేర్కొన్నారు. మరో వైపు జనం అలజడి వల్ల ఈ వైపు రాకపోవచ్చన్నారు. కెమెరాలను మరో వైపు ఏర్పాటు చేసి దాని కదలికలను పరిశీలిస్తామన్నారు. మరో వైపు వర్షం లేకపోవడంతో నేల పొడిగా మారిందని, దీని వల్ల పాదముద్రలు గుర్తించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. రైతులు మాత్రం అప్రమత్తంగా ఉండాలన్నారు. పది రోజులపాటు దీని కోసం గాలిస్తూనే ఉంటామని, రైతులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నామని చెప్పారు.

సంధ్యా సమయం.. వర్ణచిత్ర శోభితం



సాయం సంధ్యా సమయం ఎంతో అందాల శోభితంగా ఆవిష్కృతమై చూపరులను ఇట్టే ఆకట్టుకుంది. చర్ల మండలంలోని తేగడ తాలిపేరు నది వద్ద శుక్రవారం సూర్యాస్తమయ సమయంలో ఎంతో చూడముచ్చటగా కనిపించిన ఈ దృశ్యాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించారు. – చర్ల, న్యూస్‌టుడే

అజాగ్రత్తగా నడిపితే అగాథంలోకే..!



రక్షణ గోడలు లేకపోవడంతో పాలేరు కాజ్‌వే ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఖమ్మం- సూర్యాపేట రహదారిలో పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో సుమారు 350 మీటర్ల కాజ్‌వే ఉంది. గతంలో ఇక్కడ దిమ్మెలు నిర్మించినా వాహనాలు ఢీకొనటంతో కొన్ని ధ్వంసమయ్యాయి. ఇటీవల వరద ఉద్ధృతికి మరికొన్ని దెబ్బతిన్నాయి. చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా 10-20 అడుగుల ఎత్తుపై నుంచి కిందపడే ప్రమాదం పొంచి ఉంది. గతంలో ప్రమాదాలూ జరిగాయి. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ దేవేందర్ 'ఈనాడు'తో మాట్లాడుతూ కాజ్‌వేపై కర్బ్‌వాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. – ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, కూసుమంచి

ఒరిగిన స్తంభం.. ప్రమాదానికి సంకేతం..!



భారీ వర్షాలు, గాలి దుమారం. . విద్యుత్తు లైన్లకు శాపాలుగా పరిణమించాయి. సెప్టెంబర్ 1న కురిసిన వానలకు కూసుమంచి మండలం జీళ్లచెర్వు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్తును సరఫరా చేసే రెండు 11కేవీ లైన్లల్లో స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. జీళ్లచెర్వు ఎస్సీ కాలనీ ప్రాంతంలోని ఈ స్తంభాలను ఇప్పటివరకు సరిచేయలేదు. ఈ అంశంపై కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్ 'ఈనాడు'తో మాట్లాడుతూ విద్యుత్తు లైన్ చుట్టూ వివిధ రకాల పంటలను పండిస్తుండటంతో వాహనం వెళ్లే అవకాశం లేదన్నారు. అందుకే స్తంభాలను సరిచేయలేకపోయామని తెలిపారు. సత్వరం సిబ్బందితో సాధ్యమైనంత మేరకు సరిచేస్తామని చెప్పారు. పంట కోతలు పూర్తయ్యాక యంత్రాలతో లైన్లను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామన్నారు. – ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, కూసుమంచి

శివభార్గవికి ఆర్థిక సాయం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించిన స్థానిక గుడిపాడుకు చెందిన గిరిపుత్రిక శివభార్గవికి దాతలు అండగా నిలుస్తున్నారు. ఖమ్మానికి చెందిన పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు పుల్లయ్య శుక్రవారం కల్లూరు ఏసీపీ ఎ.రఘు చేతుల మీదుగా రూ.25 వేల విద్యార్థినికి అందజేశారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు రూ.10 వేలు అందించారు. అమెరికాలో ఉంటున్న తన కుమార్తె నవ్య, అశోక్ దంపతులు ఈ సాయాన్ని పంపినట్లు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రసాద్, నాగమణి, కాంగ్రెస్ నాయకుడు ఉడతనేని అప్పారావు, ఎస్‌జీపీఏటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కల్లూరు ఏసీపీ ఎ.రఘు, ట్రస్ట్ బాధ్యుడు పరిశ పుల్లయ్య

ఈనాడు కథనానికి స్పందన

వైద్య విద్యార్థికి చేయూత

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో ప్రవేశం సాధించిన విద్యార్థి ఆర్థిక ఇబ్బందులు ప్రస్తావిస్తూ 'దాతలు స్పందిస్తే.. ఆ ఊరిలో తొలి వైద్యుడు' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన సుర్దేపల్లి గ్రామానికి చెందిన మాతంగి శ్రీపతికి పలువురు ఫోన్, గూగుల్ పే రూపంలో శుక్రవారం సాయం అందించారు. బొల్లినేని మధుసూదన్ రూ.5 వేలు, జాస్తి లత, రాజా రమేష్, జంగ వెంకటరమణ రూ.3 వేల చొప్పున, పెదార్ల హరిబాబు, అయిత రాజశేఖర్, పీవీఎస్ సాయి తదితరులు రూ.2 వేల చొప్పున సాయం అందించారు. సుమారు రూ.30 వేలు విద్యార్థికి సమకూరాయి. కొందరు దాతలు చరవాణిలో సంప్రదించి వివరాలు తెలుసుకుని భరోసా ఇచ్చారు.

రూ.1.96 లక్షల వెండి మకరతోరణం బహూకరణ


మణుగూరు పట్టణం, అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం సాయిబాబా ఆలయంలోని విఘ్నేశ్వరస్వామి, మణుగూరు సాయినగర్‌లోని విజయ విఘ్నేశ్వరస్వామిలకు అశ్వాపురం గ్రామానికి చెందిన సూదిరెడ్డి విజయేందర్‌రెడ్డి, విష్ణుకుమారి దంపతుల కుమారుడు ముకేశ్‌రెడ్డి రూ.1.96 లక్షలతో రెండు కిలోల వెండి మకరతోరణం చేయించి శుక్రవారం బహూకరించారు. అమెరికాలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ముకేశ్‌రెడ్డికి ఉద్యోగం వచ్చిన సందర్భంగా వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, ఆలయ అర్చకులు సంతోష్ పవన్ కుమారశర్మ, సాయి గణశర్మ వారిని శాలువాలతో సత్కరించారు.


మణుగూరు సాయినగర్‌లోని విజయ విఘ్నేశ్వర స్వామికి వెండి మకరతోరణం బహూకరించిన దాతలు

రామగుండం-మణుగూరు రైల్వేలైన్ పనుల్లో కదలిక

భూసేకరణ ప్రక్రియకు చర్యలు

మణుగూరు పట్టణం, గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం-మణుగూరు రైల్వే లైన్ పనుల్లో కదలిక ఏర్పడింది. 207.80 కి.మీటర్లు నిర్మించాల్సిన ఈ రైల్వేమార్గంపై కేంద్ర ప్రభుత్వం అధీకృత అధికారులను ఈనెల 17వ తేదీన నియమించిన విషయం తెలిసిందే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ప్రారంభమయ్యే ఈ మార్గం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల మీదుగా రామగుండం వెళ్తుంది. రైల్వే లైన్ నిర్మాణ పనులు, నిర్వహణ బాధ్యతలను సంబంధిత ముగ్గురు అధికారులు పర్యవేక్షించనున్నారు.



రైలు మార్గం రేఖాచిత్రం

ఏడాది కిందటే సర్వే పూర్తి

రామగుండం-మణుగూరు రైల్వే పనుల సర్వేలు ఏడాది కిందటే పూర్తి చేశారు. ఆయా జిల్లా కలెక్టర్లకు నివేదికలు అప్పగించారు. రైలు మార్గానికి ఎంత భూమి సేకరించాలి? పరిహారం చెల్లింపు అంశాలను అధికారులు యజమానులతో మాట్లాడి చర్యలు చేపట్టనున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం ప్రాంతం మీదుగా ఈ రైలు మార్గం వెళ్తుంది. దీంతో మారుమూల అటవీ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పనులు పూర్తి చేసుకుంటే నిర్మాణ పనులు వేగం అందుకునే అవకాశం ఉంది.

ఏటీసీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లో అందుబాటులో ఉన్న కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్ పేర్కొన్నారు. మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను శుక్రవారం సందర్శించిన ఆయన ఏటీసీ ప్రవేశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఆరు కోర్సులకు సంబంధించిన ప్రవేశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో ప్రవేశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఏటీసీ భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఏటీసీ కోర్సులను స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటీఐ ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్ టీవో రవి, సూపరింటెండెంట్ జ్యోతిరాణి, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్, ఏటీవోలు మయ్యా శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, నర్సయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కళాశాలలో సూచనలిస్తున్న రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్

21న డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: టీజీ డీఈఈ సెట్-2024 పరీక్షలో అర్హత సాధించినప్పటికీ ధ్రువపత్రాల పరిశీలనకు వివిధ కారణాల వల్ల హాజరు కాలేకపోయిన వారికి మరోసారి ఈ నెల 21న ఖమ్మం డైట్ కళాశాలలో పరిశీలనకు అవకాశం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సామినేని సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫేజ్-1 వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులు వెబ్ ఆధారిత కళాశాల ప్రాధాన్యతలను ఈ నెల 23 నుంచి 26 వరకు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. సీటు కేటాయింపు ఈ నెల 30న జరుగుతుందని చెప్పారు. ఆన్‌లైన్ రుసుం చెల్లించి తుది ప్రవేశ లేఖ ఈ నెల 30 నుంచి నవంబరు 3 వరకు పొందవచ్చన్నారు. కళాశాలలో ఈ నెల 30 నుంచి నవంబరు 4లోపు రిపోర్టు చేయాల్సి ఉంటుందని, 4 నుంచే మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాతకక్షలతో యువకుడిపై దాడి.. అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: పాతకక్షలతో ఓ యువకుడిపై దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇల్లెందు మండలం రాగబోయినగూడెంకు చెందిన ఓ పత్రికా విలేకరి (ఈనాడు కాదు) నిట్టా సుదర్శన్ గురువారం రాత్రి జగదాంబగుంపు వద్దనున్న తన మిత్రుడు రాజేశ్ వద్దకు ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి వచ్చాడు. ఇల్లెందు నుంచి అనుసరిస్తూ వచ్చిన వంశీ, ప్రేమ్, ఉదయ్‌లు ఆయనతో గొడవపడి మద్యం సీసాలు, కర్రతో దాడిచేసి పారిపోయారు. స్థానికులు సుదర్శన్‌ను '108'లో ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీఐ సత్యనారాయణ ఆసుపత్రిలో బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కుటుంబ సభ్యులు సుదర్శన్‌ను ఖమ్మంలోని ఆసుపత్రిలో చేర్పించారు. దాడికి పాల్పడిన వారి కోసం గాలిస్తున్నామని, ఘటనపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు డీఎస్పీ వెల్లడించారు.

బోనకల్లులో హోటల్ వ్యాపారి రూ.2.75 కోట్లకు ఐపీ

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లులో హోటల్ నిర్వహిస్తున్న రామన నరసింహారావు అనే వ్యక్తి రూ.2,75,80,182కు ఐపీ దాఖలు చేశాడు. నారాయణపురం గ్రామానికి చెందిన నరసింహారావు కొన్నేళ్లుగా బోనకల్లులో సుధా హోటల్ నిర్వహిస్తున్నాడు. బోనకల్లులో సొంత ఇంటిని నిర్మించుకున్నాడు. బ్యాంకులతోపాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు తీసుకున్నారు. హోటల్ వ్యాపారం సరిగా లేకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగాయి. రుణదాతల నుంచి వత్తిడి పెరగడంతో కొన్ని రోజులుగా భార్యాపిల్లలతో సహా కనిపించకుండా పోయాడు. ఈ నేపథ్యంలో రుణదాతలకు ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి శుక్రవారం నోటీసులు అందాయి. రామన నరసింహారావు రూ.1,95,20,683, భార్య రామన సుధారాణి పేరుతో రూ.80,59,499 ఐపీ దాఖలు చేశారు. మొత్తం 84మందిని ప్రతివాదులుగా చూపారు.

మినీ మైదానం.. మెరుగైన ప్రత్యామ్నాయం

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ ఇస్తున్న కల్లూరు స్టేడియం

కల్లూరు, న్యూస్‌టుడే

నియోజకవర్గ స్థాయి మైదానంగా ఊపిరి పోసుకున్న ఆ స్టేడియం తనకున్న ఆధునిక వనరులను సద్వినియోగం చేసుకుని మెరుగైన శిక్షణ ఇస్తోంది. జిల్లా, రాష్ట్ర.. చివరకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకూ శిక్షణ ఇచ్చే ప్రత్యామ్నాయ వేదికగా మారింది. కల్లూరు గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో ఇలా శిక్షణ పొందుతున్న విద్యార్థులు పలు విభాగాల్లో రాణిస్తున్నారు.


శిక్షణ పొందిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో క్రీడాకారులతో పీడీలు

కల్లూరు గ్రీన్‌ఫీల్డ్ మినీ మైదానాన్ని అయిదెకరాల విస్తీర్ణంలో గతేడాది, ఏప్రిల్ 29న ప్రారంభించారు. ఔట్‌డోర్‌లో ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్ మైదానాలు ఏర్పాటు చేశారు. 400 మీటర్ల స్టాండెడ్ వాకింగ్, రన్నింగ్ ట్రాక్ అందుబాటులోకి తేవటంతో అథ్లెటిక్స్ క్రీడా సాధనకు బాగా ఉపయోగపడుతోంది. ఇండోర్‌లో ఆధునిక సదుపాయాలతో ఖోఖో, కబడ్డీ, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ కోర్టులున్నాయి. మైదానానికి మొత్తం మూడు శాశ్వత పోస్టులుండగా ఒకటి ఖాళీగా ఉంది. విద్యార్థులకు డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో శిక్షణను స్థానిక అసోసియేషన్ల ఆధ్వర్యంలో పీఈటీలు అందిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే జట్లు, క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు నిర్దేశించిన కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కాలంలో మైదానంలో 50మందికి సరిపడా ఆవాస సదుపాయం ఉంది. పక్కన ఉండే ప్రభుత్వ పాఠశాల, కళాశాలలను కలిపితే ఆ సంఖ్య 150కి చేరుతుంది.

దాతల చేయూత

పట్టణ పరిధిలోని దాతలు తోపుబండి ఫౌండేషన్ సాధిక్అలీ, పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో శిక్షణ కాలంలో క్రీడాకారులకు భోజన వసతులు, క్రీడా దుస్తులు సమకూర్చుతున్నారు. కొన్ని సందర్భాల్లో పోటీలకు వెళ్లే పేద విద్యార్థులకు రవాణా ఛార్జీలు, కిట్లు వితరణ చేస్తున్నారు.

మైలురాళ్లు..

✦ 2023, మే నెలలో.. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ 100, 200, 400, 800 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో విభాగాల్లో మండల, రీజియన్, జిల్లా స్థాయి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. వాలీబాల్, కబడ్డీ జిల్లా జట్టులో ఆడిన క్రీడాకారులు 13మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

✦ 2023, ఆగస్టు నుంచి నవంబరు వరకు.. జిల్లా స్థాయి చెస్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు శిక్షణ అందించారు.


✦ 2023, 24 సంవత్సరాల్లో ఖోఖో సబ్ జూనియర్ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది బాలుర జట్టు రజతం సాధించగా, బాలికల జట్టు నాలుగో స్థానంలో నిలిచింది.

✦ క్రీడా పాఠశాల్లో ప్రవేశాలకు సంబంధించిన తర్ఫీదులో కూడా ప్రత్యేక స్థానం సంతరించుకుంది. 2023-24లో మొత్తం 24 మందికి శిక్షణనివ్వగా 15మంది, 2024-25లో 12 మందికి శిక్షణ ఇవ్వగా 8 మంది అర్హత సాధించారు.

'మినీ స్టేడియంలో శిక్షణ పొందినవారు పతకాలు సాధించటం సంతోషంగా ఉంది. భవిష్యత్తులోనూ మంచి శిక్షణ అందిస్తాం.' – పసుపులేటి వీరరాఘవయ్య, పాలనాధికారి.



'జార్ఖండ్‌లో గత నెల 29 నుంచి ఈ నెల 2వరకు జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలు నిర్వహించారు. కల్లూరులో శిక్షణ తీసుకుని ఈ పోటీల్లో రజత పతకం సాధించాం.' – మాసయ్య, ములుగు జిల్లా



'ఆసిఫాబాద్ క్రీడా పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. ఈ ఏడాది హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో విజేతగా నిలవటంతో, జాతీయ స్థాయికి ఎంపికయ్యా. జాతీయ స్థాయి పోరులో నాలుగో స్థానంలో నిలిచాం. కల్లూరులో శిక్షణ బాగా ఉపయోగపడింది.' - కుర్రా నాగేశ్వరి, క్రీడాకారిణి.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,500	7,000	6,800
పాతపత్తి	7,100	7,300	7,200
పెసలు	5,100	7,225	6,300
ఏసీ ఎండుమిరప	10,400	19,000	16,000
ఎండుమిరప	9,500	16,400	15,000
ఏసీతాలుమిరప	9,300	9,500	9,300
తాలుమిరప	9,000	9,000	9,000

భద్రాచలం

•భద్రాచలం •పినపాక •అశ్వారావుపేట



న్యాయమూర్తి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయమూర్తికి సన్మానం

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన నేపథ్యంలో మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణుగూరు న్యాయవాదులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. న్యాయమూర్తి వెంకటేశ్వర్లు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, రామ్మోహన్, పోశం భాస్కర్, సరస్వతి, కవిత, చొక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద గిరిజనులకు వితరణ

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లి మండలంలోని వలస ఆదివాసీ గ్రామాల్లోని సొసైటీ వారు, ఎస్ గప్పనగర్‌లోని గిరిజనులకు లివింగ్ శక్తి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 2లక్షల విలువైన బియ్యం, సరకులు, దుప్పట్లను అందజేశారు. సంస్థ డైరెక్టర్ దేవసహాయం, సభ్యులు సామ్యూల్, వెస్లీ, సువార్త, నతానియేల్ తదితరులు పాల్గొన్నారు.



రూ.50 వేల చెక్కు అందుకుంటున్న పెనుబల్లి హర్షిత

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఐటీడీఏ సాయం

భద్రాచలం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం మండలం చిన్న ఆర్లగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి హర్షిత అనే నిరుపేద గిరిజన విద్యార్థిని నీట్ ద్వారా ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమెకు ఐటీడీఏ పీఓ రాహుల్, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఐటీడీఏలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా వైద్యురాలిగా పట్టా పొంది మన్యంలోని పేదలకు వైద్య సేవలు అందించాలని పీఓ సూచించారు.

హాజరు శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అధ్యాపకులు కృషిచేయాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి హెచ్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తొలుత విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం వేర్వేరుగా అధ్యాపకులతో మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలన్నారు. విద్యార్థుల హాజరు రికార్డులను తనిఖీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ.అనిత, ఏజీఎంఓ అరవింద్ వివరాలు తెలిపారు.

నందూరి ఎంకిలా..

జానపదాల్లో నందూరి ఎంకిలు అందరూ ఒక చోట చేరితే ఎలా ఉంటుందో ఆ యువతులు చేసే నృత్యం అంత అబ్బురంగా ఉంటుంది. జానపద జావళీలు పలకించే ముద్దుగుమ్మల నృత్యాలు చూస్తుంటే ‘జాణవులే నెరజాణవులే’ అన్నట్లుగా ఉంటుంది. ఎల్లమ్మ, పోలేరమ్మ, మైసమ్మ నృత్యాలు చేస్తే పూనకాలు తెప్పిస్తాయి. వేదిక ఏదైనా, ఎక్కడైనా నృత్యాలు చేశారంటే బహుమతులు వారి సొంతం కావాల్సిందే. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో 3వ, 4 సంవత్సరం విద్యార్థినులు ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కళా సాంస్కృతిక పోటీల్లో హైదరాబాదులోనూ విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన యువజనోత్సవాల్లోనూ ఇచ్చిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఉర్రూతలూగించింది.

- అశ్వారావుపేట, న్యూస్‌టుడే



నాగిని నృత్యంతో..

స్థానిక వ్యవసాయ కళాశాలలో ఏజీబీఎస్సీ 3వ సంవత్సరం చదువుతున్న నాగరాణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. తనతో పాటు ఉన్న సహ విద్యార్థులతో కలిసి ఉత్తమ ప్రదర్శన ఇస్తూ పలువురి మన్ననలు అందుకుంటోంది. విశ్వవిద్యాలయం స్థాయిలో విశేష గుర్తింపు వచ్చినా చదువు, నృత్యం నాకు రెండు కళ్లు అంటారు నాగరాణి..



చిన్నప్పటి నుంచి జానపదాలు అంటే ఇష్టం: రిచా

పాఠశాల స్థాయి నుంచే జానపద నృత్యాలు అంటే ఎంతో ఇష్టం. ఇంటర్మీడియట్‌లోనూ పలు బహుమతులు అందుకున్నాను. వ్యవసాయ కళాశాలలో చదువుతో పాటు జానపద నృత్యాలూ చేసే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉంది.



చదువు, క్రీడలతోపాటు.. సలోమి

చదువు, క్రీడలు, నృత్యం అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే నృత్య ప్రదర్శనలతో ఉత్తమ విద్యార్థిగా బహుమతి అందుకున్నాను. చిన్నప్పుడు ఆలయాల్లో చేసిన ప్రదర్శనను చూసినవారు ఎంతగానో మెచ్చుకునేవారు. అలా ఇష్టంగా మారింది.



నృత్యంతో ఎన్నో బహుమతులు: తరుణిశ్రీ

జానపద నృత్యాలతో పాటు శాస్త్రీయ నృత్యం అన్నా ఎంతో ఇష్టం. కూచిపూడి, భరతనాట్యంకు పాఠశాల స్థాయి నుంచే బహుమతులు వచ్చేవి. అలా జానపద నృత్యాలు ఇష్టంగా మారాయి. గత ఏడాది నిర్వహించిన కళాశాల నృత్య పోటీల్లో బహుమతులు అందుకున్నాను.



భాష రాకపోయినా భావం తెలుసు: ఆదిత్య

కేరళ నుంచి వచ్చాను. ఈ ప్రాంత భాషలు అంతగా తెలియదు. నృత్యం అంటే ఉన్న ఇష్టంతో తోటి విద్యార్థులతో కలిసి భరత నాట్యం, జానపద, పాశ్చాత్య నృత్యాలతో అల్లరి చేసేదాన్ని. అదే ఇష్టంగా మారడంతో జానపదాల్లో బహుమతులు తెచ్చిపెట్టింది.



ఎంతో అభిమానం: అఖిల కోటేశ్వర్

పాఠశాల స్థాయి నుంచే మా కుటుంబంలో తెలంగాణ జానదాలు అంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టమే నన్ను జానపద నృత్యాల వైపు మొగ్గు చూపేలా చేసింది. చదువుతో పాటు నృత్యం ఇష్టంగా భావిస్తాను.



సమస్య: మణుగూరు మండలం రాజీవ్ గాంధీనగర్‌లో వీధి శునకాల బెడద తీవ్రంగా ఉంది. - రామకృష్ణ, స్థానికుడు

సమాధానం: వీధి శునకాల నియంత్రణకు చర్యలు చేపడతాం. - శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి

- మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే

సారపాకలోని గాంధీనగర్ కాలనీలో మురుగు కాలువలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - మోహన్‌శర్మ, స్థానికుడు

✔ నూతనంగా మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. - మహేష్, పంచాయతీ కార్యదర్శి - బూర్గంపాడు, న్యూస్‌టుడే

పినపాక మండల కేంద్రంలో మురుగు కాలువ శుభ్రం చేయకపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. - గ్రామస్థులు

✔ పరిశీలించి వెంటనే కాలువలు శుభ్రం చేయిస్తాం. - ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పినపాక, న్యూస్‌టుడే

అశ్వారావుపేట పట్టణం శివయ్య వీధిలో పలు కాలనీల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. - రజని, అశ్వారావుపేట

✔ పంచాయతీలో చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్, ఆటోలు మూడు మరమ్మతులకు గురికావడంతో సత్తుపల్లికి పంపాం. వేరే వాహనం పంపి డబ్బాల్లో ఉన్న చెత్తను తొలగించే ఏర్పాటు చేస్తాం. - కె.శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి - అశ్వారావుపేట, న్యూస్‌టుడే

ములకలపల్లి పంచాయతీ కార్యాలయానికి ఇరువైపులా ఉన్న వీధి లైట్లు రెండు నెలలుగా వెలగడంలేదు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించడంలేదు. - సాయిబాబు, ములకలపల్లి

✔ పంచాయతీ ఆధ్వర్యంలో వీధిలైట్ల మరమ్మత్తులు చేసి నూతన బల్బులను ఏర్పాటు చేశాము. లోఓల్టేజి సమస్యతో బల్బులు వెలగడం లేదు. విద్యుత్‌శాఖ అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరిస్తాం. - రవి, పంచాయతీ కార్యదర్శి, ములకలపల్లి

- ములకలపల్లి, న్యూస్‌టుడే



మణుగూరు: విజేతలతో శ్రీవిజ్ఞాన్ పాఠశాల నిర్వాహకులు

పరీక్ష రాసి.. ప్రతిభ చాటి

‘ఈనాడు’ ఆధ్వర్యంలో మణుగూరులోని శ్రీవిజ్ఞాన్ ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో బాలబాలికలు సత్తా చాటారు. శ్రీవిజ్ఞాన్ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎం.భానుప్రసాద్, వి.కార్తీక్, చిన్ని జ్యోష్ణకు కరస్పాండెంట్ సప్పిడి సాంబశివరెడ్డి, జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న కె.మహేశ్, జి.జీష్మ, సీహెచ్ అక్షితకు ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీ బహుమతులు అందజేశారు.

- మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే



విజేతలతో జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగశ్రీ, ఉపాధ్యాయులు

నలుగురిని కాపాడిన ఫొటోగ్రాఫర్ లక్ష్మణ్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం వద్ద గోదావరి స్నానాలకు వచ్చిన నలుగురు నదిలో మునిగి పోతుండగా ఫొటోగ్రాఫర్ లక్ష్మణ్ వారి ప్రాణాలను కాపాడారు. ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ మహిళ, ముగ్గురు చిన్నారులు(10 ఏళ్లలోపు) నదిలో లోతు అంచనా వేయక మునిగిపోతుండటంతో ఆ పక్కనే ఫొటోలు తీస్తున్న ఫొటోగ్రాఫర్ లక్ష్మణ్ గుర్తించి వారిని బయటకు లాక్కొచ్చి నలుగురి ప్రాణాలు కాపాడారు. ఈ క్రమంలో లక్ష్మణ్ కెమెరా, చరవాణి నీటిలో తడిసి పాడైపోయాయి. రామయ్య దయవల్ల వారిని కాపాడగలిగానని... వారు ఏ గ్రామం నుంచీ వచ్చిందీ తమకు తెలియదని లక్ష్మణ్ తెలిపారు.

రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి: ఏడీఏ

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: లైసెన్సులులేని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మకూడదని, రైతులకు తప్పనిసరిగా అమ్మకం రసీదు ఇవ్వాలని మణుగూరు డివిజన్ వ్యవసాయశాఖ అధికారి(ఏడీఏ) తాతారావు పేర్కొన్నారు. ఆళ్లపల్లి, మర్కోడు తదితర గ్రామాల్లో శుక్రవారం ఎరువుల, విత్తనాల దుకాణాల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.



లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందించిన కో డైరెక్టర్ మాగంటి సాయి సూర్య

ఉల్లాసంగా ప్రతిభాపాటవ పోటీలు

భద్రాచలం లిటిల్ ఫ్లవర్స్ హైస్కూల్ (తాతగుడి సెంటర్)లో, భద్రాచలం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ‘ఈనాడు’ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభాపాటవ పోటీలు సాగాయి. ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. లిటిల్ ఫ్లవర్స్ హైస్కూల్‌లో విజేతలుగా నిలిచిన బి.లోహితశ్రీ, ఎం.రక్షిత, కె.అభిరూప్‌లకు పాఠశాల కోడైరెక్టర్ మాగంటి సాయి సూర్య, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విజేతలుగా నిలిచిన ఎస్కే నాజ్మీన్, సీహెచ్ నిహారిక, ఎ.దివ్యలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోటమళ్ల రమ ప్రశంసా పత్రాలతో పాటు బహుమతి ప్రదానం చేశారు.

- భద్రాచలం, న్యూస్‌టుడే



జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు బహుమతులు అందించిన హెచ్‌ఎం టి.రమ, ఉపాధ్యాయినులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరకగూడెం, అశ్వాపురం, న్యూస్‌టుడే: కరకగూడెం ఉపకేంద్రంలో 33 కేవీ విద్యుత్తులైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరకగూడెం మండలం మొత్తం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తు సంస్థ ఏఈ నరేందర్‌రెడ్డి తెలిపారు. ★ అశ్వాపురం మండలంలోని మొండికుంట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తు సంస్థ ఉప ఇంజినీర్ మణిదీప్ శుక్రవారం తెలిపారు.

ముమ్మరంగా భాజపా సభ్యత్వ నమోదు

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రాజాపురం, పెంట్లం, అన్నపురెడ్డిపల్లిలో భాజపా ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆపార్టీ మండల అధ్యక్షుడు దేవీబాలకిరణ్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సభ్యత్వ నమోదు కన్వీనర్ దుర్గా శ్రీనివాసరావు, ముసలయ్య, జటంగి కృష్ణ, జుబ్బూరి రమేష్ పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

భద్రాచలం పట్టణం: చర్ల రోడ్డులోని బీఈడీ కళాశాల పక్కన, ఎదుట ఆక్రమించి ఏర్పాటైన దుకాణాలు ఖాళీ చేయించే చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌కు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ శుక్రవారం భద్రాచలం గ్రామసభలో వినతిపత్రం అందజేశారు.

ఏకలవ్య విద్యార్థులకు వైద్య పరీక్షలు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లక్ష్మీనగరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, వైద్యాధికారి పుల్లారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఏకలవ్య పాఠశాలలో పారిశుద్ధ్య చర్యలు లోపించి కొద్దిరోజులుగా విద్యార్థులు అనారోగ్యం బారినపడుతున్నారని కలెక్టర్ జితేశ్ వి. పాటిల్‌కు గురువారం మండల పర్యటనలో బాలల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వైద్యాధికారులు పాఠశాలను సందర్శించి విద్యార్థులు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిసరాలను, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. తగు సూచనలు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుండాల, న్యూస్‌టుడే: గిరిజన ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గుండాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం మేనేజర్ నరసింహారావు ప్రారంభించారు. తహసీల్దారు ఇమ్మానియేలు, డివిజన్ మేనేజర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కొత్తగూడెం నుంచి ఈ నెల 25న చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్‌ను మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందర్‌రావు, నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళితుల ఐక్యతను చాటేందుకు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో యాత్ర జరగనున్నట్లు తెలిపారు.

దమ్మపేట మండలానికి ముగ్గురు పశువైద్యులు

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేట మండలానికి ముగ్గురు పశువైద్యులు రానున్నారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జీతో కాలం వెళ్లబుచ్చిన పశు వైద్యశాలలు వైద్యుల రాకతో కళకళలాడనున్నాయి. దమ్మపేట వైద్యశాలకు యు.తేజారాణి, పట్వారిగూడెంకు ఎం.ప్రశాంత్, నాగుపల్లి వైద్యశాలకు ఏలేటి శ్యాంబాబును నియమించినట్లు అశ్వారావుపేట సహాయ సంచాలకుల ప్రవీణ్ తెలిపారు.

రహదారుల నిర్మాణానికి మంత్రికి ప్రతిపాదనలు





పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట నియోజకవర్గంలో కొత్త రహదారుల నిర్మాణానికి, కొన్ని రహదారుల అభివృద్ధికి ర.భ. శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి రూ.51కోట్లతో ప్రతిపాదనలను శాసనసభ్యుడు జారే ఆదినారాయణ శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో అందజేశారు. గండుగులపల్లి నుంచి గోపాలపురానికి రూ.16 కోట్లు, అచ్యుతాపురం క్రాస్‌రోడ్డు- మద్దికొండ-మల్కారం- మీదుగా దమ్మపేట శివాలయం వరకూ రూ.13 కోట్లు, నారాయణపురం- గుమ్మడవల్లి మధ్య వరదలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు రూ.2.8కోట్లు, అన్నపురెడ్డిపల్లి- ఎర్రగుంట రోడ్డు వెడల్పు కోసం రూ.15 కోట్లు తదితరాలతో ప్రతిపాదనలు లేఖ ఇచ్చినట్లు జారే తెలిపారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధికి రూ.60 కోట్ల నిధులు ఇవ్వాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ర.భ.శాఖ, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ప్రతిపాదనలు అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. భద్రాచలం - వెంకటాపురం వరకు ప్రధాన రహదారి, మరమ్మతులు, ఇతర విషయాలపై చర్చించినట్లు తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ సతీశ్‌కుమార్

సారపాకలో పోలీసుల నిర్బంధ తనిఖీలు

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం సారపాకలోని గాంధీనగర్‌కాలనీలో పోలీసులు శుక్రవారం ఉదయం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్థానికుల ధ్రువపత్రాలతోపాటు వాహనాల దస్త్రాలు పరిశీలించారు. సరైన పత్రాలులేని 23 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, ఒక కారు స్వాధీనం చేసుకుని పోలీస్ ఠాణాకు తరలించారు. యువత సన్మార్గంలో నడవాలని సతీశ్‌కుమార్ సూచించారు. సీఐ వినయ్‌కుమార్, పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న పంచాయతీ ఉద్యోగి

బూర్గంపాడు, న్యూస్‌టుడే: సారపాక పంచాయతీలో బిల్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ నిజాయితీ చాటుకున్నారు. ప్రవీణ్‌కుమార్ ఈనెల 7న సారపాకలోని ఓ ఏటీఎంకు డబ్బులు డ్రాచేసుకునేందుకు వెళ్లారు. అప్పటికే ఏటీఎంలో రూ.10 వేలు ఉండడంతో బయటకు వచ్చి చూశారు. ఎవరూ లేకపోవడంతో ఏటీఎంలో నగదు దొరికిన విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. నగదు కోల్పోయిన అఖిల్ శుక్రవారం సంప్రదించడంతో పంచాయతీ కార్యాలయంలో రూ.10 వేలు అందించారు.

పరిహారం చెల్లించాలని ఆందోళన

బూర్గంపాడు, న్యూస్‌టుడే: ఇరవెండి నుంచి ఐటీసీ కర్మాగారానికి నూతనంగా నిర్మిస్తున్న పైపులైనుతో పంట పొలాలకు నష్టం కలుగుతుందని తమకు పరిహారం చెల్లించాలని స్థానిక రైతులు గురువారం రాత్రి ఆందోళన చేపట్టారు. తమకు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు పూర్తి చేయాలని భైఠాయించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి చెందిన ఘటన ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవెంకటపురం గ్రామానికి చెందిన కల్తీ మంగయ్య(58) ఈనెల 15న ఉదయం వ్యవసాయ పనికి వెళ్లాడు. అక్కడ కడుపునొప్పి తట్టుకోలేక పురుగు మందు తాగాడు. వ్యవసాయక్షేత్రం నుంచి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఇదిగో నేను తాగిన మందు అని చెప్పి కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం పట్టణానికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్దుకూరు వద్ద లారీ బోల్తా: చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం మద్దుకూరు మలుపు వద్ద శుక్రవారం సాయంత్రం కంకరలోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. మలుపు వద్ద జడ్పీ పాఠశాల ప్రహరీని ఢీకొట్టడంతో కంకర అంతా పాఠశాలలో పడింది. ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి పక్కనే పాఠశాల ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే కాషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం: దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధి తూరుబాక గ్రామంలో బూరం వెంకటేశ్వర్లుకు చెందిన ఇల్లు శుక్రవారం అగ్ని ప్రమాదంలో కాలింది. కుటుంబ సభ్యులందరూ వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోయింది.

కోడిపందేల స్థావరంపై దాడి: పినపాక, న్యూస్‌టుడే: బీసువారిగూడెం అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆ స్థావరంపై శుక్రవారం దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

చిన్నారిపై కుక్కదాడి: దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేట అర్బన్‌కాలనీలో భార్గవ్ అనే ఐదేళ్ల బాలుడిపై శుక్రవారం కుక్కదాడి చేసి గాయపర్చింది. బాలుడు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో ఓ కుక్క హఠాత్తుగా బాలుడిపై పడింది. పలు చోట్ల కరిచింది. కుటుంబ సభ్యులు బాలుడిని దమ్మపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లికి తరలించారు.

నైపుణ్యంతో ఉపాధి పొందండి: ఏపీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: నైపుణ్యం ఉంటే ఏ రంగంలోనైనా చక్కని ఉపాధి అవకాశాలను పొందవచ్చని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు స్థానిక వైటీసీలో శుక్రవారం ఉపాధి పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలను సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ, కృషి చేయాలని, ఇందుకు అవసరమైన శిక్షణ ఐటీడీఏ అందిస్తుందని వివరించారు. ప్రైవేటు రంగంలో రాణించేందుకు నైపుణ్యం శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. టైలరింగ్ శిక్షణకు 65 మంది, పుట్ట గొడుగుల సాగుకు 10 మంది, తేనెటీగల పెంపకానికి 23 మంది, బ్యూటీషియన్ కోర్సుకు 16 మంది, ఎలక్ట్రీషియన్ శిక్షణకు 9 మంది దరఖాస్తు చేసుకున్నారని వీరికి నిపుణులు తర్ఫీదు ఇస్తారని వివరించారు. జిల్లా జాబ్స్ మేనేజర్ హరికృష్ణ, అనూష, మణికుమారి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో శ్రీతేజకు బంగారు పతకం



భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం గిరిజన సంక్షేమ గురుకులంలో హెచ్ఈసీ చదువుతున్న విద్యార్థిని టి.శ్రీతేజ అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించింది. ఏపీలోని గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 35వ సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న తేజ ప్రథమ స్థానం పొందింది. ఆమెను ఐటీడీఏ పీఓ రాహుల్, ఆర్సీఓ నాగార్జున, ప్రిన్సిపల్ పద్మావతి, సిబ్బంది అభినందించారు.

ఆలయ మాడవీధుల విస్తరణపై సర్వే

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయ మాడవీధుల విస్తరణకు సుమారు 46 ఇళ్లను తొలగించాల్సి ఉండడంతో శనివారం ఇందుకు సంబంధించిన సర్వేను ఆర్డీఓ దామోదర్‌రావు నేతృత్వంలో నిర్వహించనున్నారు. ఇళ్ల విస్తీర్ణంతో పాటు ఆ ప్రాంగణంలో స్థలాల కొలతలను సేకరించే వీలుంది. మాడవీధులకు సమీపంలో ఉన్న వారు ఇళ్లను ఇచ్చేందుకు రాతపూర్వకంగా ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో సర్వే నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రామాలయంలో ఇద్దరు ఉద్యోగులకు మెమోలు జారీ?

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలోని ఇద్దరు ఉద్యోగులకు ఈఓ రమాదేవి శుక్రవారం మెమోలు జారీ చేసినట్లు సమాచారం. రామాలయానికి అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలను గురువారం ఉదయం కొన్ని గంటల పాటు మూసి ఉంచారు. ఇది వివాదమైంది. ఈ అంశంపై ఆలయ సూపరింటెండెంట్‌కు, ఇన్‌స్పెక్టర్‌కు మెమోలు జారీచేసి వివరణ కోరినట్లు తెలుస్తోంది. వీరిచ్చే వివరణను దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకునే వీలుందని సమాచారం.

క్రమశిక్షణతో ఉన్నత స్థితికి రావాలి: సుమన్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి క్రమశిక్షణతో ఉన్నత స్థితిని చేరుకోవాలని సినీ నటుడు సుమన్ ఆకాంక్షించారు. శుక్రవారం భద్రాచలం వచ్చిన సుమన్ ఆయన మిత్రుడైన స్థానిక నన్నపనేని మోహన్ నిర్మించిన కొర్రాజుల గుట్ట పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. చదువుతో ఏదైనా సాధించవచ్చని చక్కగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉపాధి పొందండి: ఏపీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: నైపుణ్యం ఉంటే ఏ రంగంలోనైనా చక్కని ఉపాధి అవకాశాలను పొందవచ్చని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు స్థానిక వైటీసీలో శుక్రవారం ఉపాధి పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలను సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ, కృషి చేయాలని, ఇందుకు అవసరమైన శిక్షణ ఐటీడీఏ అందిస్తుందని వివరించారు. ప్రైవేటు రంగంలో రాణించేందుకు నైపుణ్యం శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. టైలరింగ్ శిక్షణకు 65 మంది, పుట్ట గొడుగుల సాగుకు 10 మంది, తేనెటీగల పెంపకానికి 23 మంది, బ్యూటీషియన్ కోర్సుకు 16 మంది, ఎలక్ట్రీషియన్ శిక్షణకు 9 మంది దరఖాస్తు చేసుకున్నారని వీరికి నిపుణులు తర్ఫీదు ఇస్తారని వివరించారు. వీరికి ఉపాధి అవకాశాలనూ కల్పిస్తామన్నారు. జిల్లా జాబ్స్ మేనేజర్ హరికృష్ణ, అనూష, మణికుమారి పాల్గొన్నారు.

మలుపులు.. మృత్యు ద్వారాలు!



అయ్యన్నపాలెం ఒడ్డు వద్ద ప్రమాదకరంగా మలుపు

చంద్రుగొండ, న్యూస్‌టుడే: మండలంలోని జాతీయ రహదారిపై పలు గ్రామాల వద్ద ఉన్న మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దగ్గరకు వచ్చే వరకు మలుపులు గుర్తించలేకపోతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మద్దుకూరు మలుపు వద్ద నెలకు కనీసం మూడు లోడు లారీలు బోల్తా పడుతున్నాయి. అయ్యన్నపాలెం ఒడ్డు వద్ద ఉన్న మలుపు వద్ద రెండు నెలల క్రితం ద్విచక్రవాహనంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందారు. మద్దుకూరు వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు మలుపు వద్ద బోల్తాపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చంద్రుగొండ ప్రధాన సెంటర్లోని మలుపు వద్ద ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. తిప్పనపల్లి ప్రధాన సెంటర్లోని మలుపు వద్ద గతేడాది సుజాత్‌నగర్ నుంచి వస్తున్న కూలీల ట్రాలీని బొగ్గు టిప్పర్ ఢీకొనటంతో ముగ్గురు కూలీలు మృతి చెందగా.. మరో ముగ్గురు దివ్యాంగులుగా మిగిలారు. ఎంపీడీవో అశోక్‌ను వివరణ కోరగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం • ఇల్లెందు

నవంబరు 15, 16న 'తెలంగాణ కార్నివాల్'



కార్నివాల్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో నవంబరు 15, 16 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ కార్నివాల్' ప్రచార లోగోను కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు ఆనందరావు, మద్దెల శివ కుమార్, అల్లి శంకర్, ధన్‌రాజ్, శుభాకర్, రాఘవ, శశికళ, కమలారాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు..

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఏదైనా సాధించాలనే తపన, పట్టుదల ఎవరినైనా ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని ఏరియా ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి అన్నారు. ఈఈలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను పొందిన స్థానికులు రాము, దుర్గాప్రసాద్‌ను సివిల్ కాంట్రాక్టర్లు శుక్రవారం సన్మానించారు. అచ్యుతరామయ్య, శ్రీనివాస్, కళ్యాణ్, మోహన్, షబ్బీర్, క్రాంతి, కృష్ణారెడ్డి, సంపత్‌రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689

శ్రీనగర్‌కాలనీ పంచాయతీలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇంట్లో వస్తువులను చిందరవందర చేసి వాటిని ఎత్తుకెళ్తున్నాయి. జనంపై దాడి చేస్తున్నాయి. **- ఓ పాఠకుడు**

✔ ఆ ఏరియాలో కోతులను పట్టించి సమీప అడవుల్లోకి తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. **- పంచాయతీ కార్యదర్శి**

– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పులి, కుక్క.. హడలెత్తించే చిట్కా



పంట చేతికందాల్సిన కంకి దశలోని వరి పైర్లను వానర మూకలు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులకు కంటిమీద కునుకు కరవవుతోంది. ఈ నేపథ్యంలో టేకులపల్లికి చెందిన ఏపూరి సీతయ్య ఓ ఉపాయం ఆలోచించారు. భారీ పులి బొమ్మను హైదరాబాద్‌ను తెప్పించి పొలం గట్టుపై పెడుతున్నారు. దీనికి తోడు మైకు సాయంతో కుక్కలు అరిచే శబ్దాన్ని వినిపిస్తున్నారు. ఈ దెబ్బతో వానరాలు బెదిరి పోయి పొలం వైపు రాకుండా పోయినట్లు సీతయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

– టేకులపల్లి, న్యూస్‌టుడే

వచ్చే మూణ్నెల్లు.. శరవేగంగా బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే



కొత్తగూడెం ఏరియా జీఎం షాలేమురాజుతో

ముఖాముఖి

ఓ వైపు బొగ్గు ఉత్పత్తిలో ఒడుదొడుకులు.. ఇంకోవైపు కార్మికులు, యంత్ర పరికరాల పూర్తి సామర్థ్యం పెంపుపై కసరత్తు.. వెరసి వార్షిక లక్ష్య సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేము రాజు అన్నారు. ఈ ఏడాది నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల ఇప్పటి వరకు రూ.7.5 కోట్ల అదనపు ఆదాయాన్ని ఆర్జించినట్లు చెప్పారు. ఏరియాలో నూతన ప్రాజెక్టులు, కార్యాలయాల నిర్మాణాల పురోగతి, ఉత్పత్తి ప్రణాళికలకు సంబంధించిన పలు అంశాలను 'ఈనాడు' 'ముఖాముఖి'లో వెల్లడించారు.

దెబ్బతిన్న బంకరుపై నిర్ధారణ కమిటీ: సత్తుపల్లి కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంటులో మూడింట ఓ బంకరును నాసిరకంగా నిర్మించడం వల్ల రూ.కోటి నుంచి రూ.2 కోట్ల దాకా నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నాం. అయినా బొగ్గును విఘాతం కలగకుండా రవాణా చేస్తున్నాం. దెబ్బతిన్న బంకరును హైదరాబాద్‌కు చెందిన ఐఐటీ నిపుణులు పరిశీలించారు. నివేదికలో నాసిరకం నిర్మాణమా? డిజైన్ లోపమా? అనేది తేలుతుంది. దీని ప్రకారం గుత్త సంస్థ 'సమంతా కంపెనీ'పై చర్యలుంటాయి. మరమ్మతులపై ఆ సంస్థ సానుకూలంగానే ఉంది.

క్వార్టర్ల ఆక్రమణపై పాలసీ: క్వార్టర్లు, వాటి మధ్యలోనున్న ఖాళీ ప్రాంతాల ఆక్రమణల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఒక పాలసీని తెచ్చి నియంత్రణకు త్వరలో చర్యలు తీసుకొంటాం.

కలెక్టర్‌దే తుది నిర్ణయం: కొత్తగా వీకే ఓసీ విస్తరించనున్న వనమానగర్, మాయాబజార్ నిర్వాసిత ప్రాంతాల వారు న్యాయమైన పరిహారం కోసం కోర్టును ఆశ్రయించారు. దాన్ని న్యాయస్థానం కొట్టేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఇప్పటికే వారికి ఇళ్ల స్థలాలిచ్చాం. కలెక్టర్ తుది నిర్ణయం మేరకు చర్యలుంటాయి.

పాదయాత్రలు, 'డయల్ యువర్ జీఎం' లేకున్నా..: కార్మిక సమస్యలపై ఎవరైనా నేరుగా నన్ను కలవొచ్చు. కార్యాలయంలో సాయంత్రం 4-6 మధ్య నాతో మాట్లాడొచ్చు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరిస్తాం.

వార్షిక ఉత్పత్తిపై దృష్టి: వార్షిక లక్ష్యంలో ఇప్పటి వరకు 94 శాతం లక్ష్యాన్ని సాధించాం. ఏరియాలో 71.78 లక్షలకు గాను 66.97 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాం. వర్షాలు కురవడంతో కొంత లోటు ఏర్పడింది. చివరి మూణ్నెల్లలో ఉత్పత్తి మరింత పుంజుకొంటుంది.

నాలుగు నెలల్లో.. కొత్త గనిలో..: కొత్త గని 'వీకే మైన్' స్టేజ్-2 అనుమతులు మరో మూడు, నాలుగు నెలల్లో లభిస్తాయి. ఆ వెంటనే అక్కడ కూడా ఉత్పత్తి పనులు మొదలుపెడతాం.

పురోగతిలో..

☆ కాగితపు రహిత సేవలను ప్రయోగాత్మకంగా స్థానిక నూతన జీఎం కార్యాలయంలో సింగరేణిలో తొలిసారి ప్రారంభించనున్నాం. రెండు, మూడు నెలల్లో కొన్ని కార్యకలాపాలు ఈ ప్రక్రియ కింద అమలు చేస్తాం.

☆ ఏరియాలోని ఓసీలో చేపట్టిన ఎకో పార్కు పనులు పూర్తికావచ్చాయి. ప్రగతి వనంలోనూ వాకింగ్‌ట్రాక్ నిర్మించాం. విద్యుత్తు అలంకరణ వంటి చిన్న పనులు పూర్తయ్యాక ప్రారంభిస్తాం.

☆ కొత్తగా చేపట్టిన క్వార్టర్ల నిర్మాణాన్ని మరో ఆరు నెలల్లోనే పూర్తిచేసి అర్హులైన కార్మికులకు కేటాయిస్తాం.

☆ సత్తుపల్లిలో మహిళలకు సింగరేణి సేవా సమితి శిక్షణలను ప్రారంభించాం. వీలైనంత త్వరగా 'గూడెం' ఏరియాలోనూ ప్రారంభించి చేతివృత్తులపై ఉపాధితో కూడిన శిక్షణలిస్తాం.

పచ్చని గిరులు.. వెండి మబ్బులు



నీలి ఆకాశంలోని వెండి మబ్బులు పచ్చందాలు పరచుకున్న గిరులను తాకుతూ వెళ్తున్న ఈ దృశ్యం స్థానిక జీకే ఓసీ వద్ద 'న్యూస్‌టుడే' కెమెరా కంటికి శుక్రవారం చిక్కింది.

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

కుమురం భీంకు నివాళులు

టేకులపల్లి, న్యూస్‌టుడే: కుమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం తుమ్మలచెలకలో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో నిర్వహించారు. సేన మండలాధ్యక్షుడు జోగా ప్రసాద్, సనప రామారావు, ఊకే రామారావు, గోపాల్, పాపారావు, సర్వేశ్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు మండలంలోని 62 చెరువుల్లో వదిలేందుకు రూ.3.03 లక్షల విలువైన 4.73 లక్షల చేప పిల్లలను ఉచితంగా అందజేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. చేప పిల్లలను ఎంపీడీవో కార్యాలయంలో చల్లసముద్రం, కొమరారం, రొంపేడు, సుదిమళ్ల రెవెన్యూ జిల్లాల పరిధిలోని మత్స్యకారులకు శుక్రవారం అందజేశారు. మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య, ఎంపీడీవో, ఎంపీవో, ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

మండల పశువైద్యాధికారిగా కాత్యాయని



సుజాతనగర్, న్యూస్‌టుడే: మండల పశువైద్యాధికారిగా సింగిరాల కాత్యాయని నియమితులయ్యారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన కాత్యాయని టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అసిస్టెంట్ సర్జన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఆమెకు అధికారులు తొలి పోస్టింగ్‌ను సుజాతనగర్ మండలంలో కల్పించారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా

జూలూరుపాడు, న్యూస్‌టుడే: రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా, ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలరావు, వీరభద్రం, సిద్ధు, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీలతో సృజనాత్మకతకు పదును



కేజీబీవీలో.. విజేతలతో ప్రత్యేకాధికారి తులసి, ఉపాధ్యాయులు



కేటీపీఎస్ బాలికోన్నత పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న హెచ్.ఎం. రమా

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి వ్యాసరచన పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని పాల్వంచ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రత్యేకాధికారి తులసి, కేటీపీఎస్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమా పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై జరిగిన వ్యాసరచనలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కేజీబీవీలో మాధవి ప్రథమ, సాత్విక ద్వితీయ, లీలాసింధు తృతీయ, కేటీపీఎస్ బాలికోన్నత పాఠశాలలో సౌజన్య ప్రథమ, హర్షిత ద్వితీయ, సఫీయా బర్కత్ తృతీయ బహుమతులు సాధించారు. వారికి పీవో, హెచ్.ఎం.లు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. – పాల్వంచ, న్యూస్‌టుడే

వర్షపు నీటితో పాట్లు
పటిష్ఠతకు తూట్లు

సుజాతనగర్-లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య ఎదుళ్లవాగుపై ఆరేళ్ల క్రితం సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నూతన వంతెన నిర్మించారు. దీన్ని అధికారికంగా ప్రారంభించకున్నా.. పై గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలకు వంతెన మీద నీరు నిలుస్తోంది. దీనివల్ల ఉపరితల సిమెంట్ ఫ్లోరింగ్ దెబ్బతింటోంది. వర్షపు నీరును వాగులోకి మళ్లించే కందకాలు మట్టితో కూరుకుపోవడమే ఈ సమస్యకు కారణం. పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... ఎఫ్‌డీఆర్(ఫ్లడ్ డామేజ్ రిపేర్) నిధులు రూ.3 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. త్వరలో వియరింగ్ కోట్, సిమెంట్ ప్యాచ్ వంటి మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు.

– సుజాతనగర్, న్యూస్‌టుడే



నేడు భారాస జిల్లా స్థాయి సమావేశం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: భారాస జిల్లా స్థాయి సమావేశాన్ని కొత్తగూడెంలోని బీఆర్ఎస్ భవన్‌లో శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు మోరె భాస్కర్ తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని.. నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం..

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెం నార్త్ సెక్షన్ పరిధిలోని భజనమందిర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం కొత్తగూడెం పట్టణంలోని పెద్దబజార్, చిన్నబజార్, నేతాజీ మార్కెట్, మేదరబస్తీ, కూలీలైన్ ప్రాంతాల్లో ఉ.7 గంటల నుంచి మ.2 గంటల వరకు, గాజులరాజం బస్తీ, హనుమాన్‌బస్తీ, బూడిదగడ్డ, సాయినగర్, శ్రీనగర్, గణేశ్ బస్తీల్లో ఉ.9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి, బోడు, కోయగూడెం, బొమ్మనపల్లి విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో శనివారం ఉ.9 నుంచి మ.12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు హట్కర్ దేవా, పిండిపోలు బుజ్జి కన్నయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈ మురళీకృష్ణ

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: శుద్ధజలాలను ప్రజలకు అందించేందుకు గ్రామస్థాయిలో సిబ్బంది చొరవ తీసుకోవాలని మిషన్ భగీరథ డీఈ మురళీకృష్ణ సూచించారు. ఇల్లెందు మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఏఈలు చంద్రశేఖర్, బాలాజీ పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



చుంచుపల్లి, న్యూస్‌టుడే: చుంచుపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో ఐదున్నర అడుగుల కొండచిలువను స్థానికులు శుక్రవారం రాత్రి గుర్తించారు. వెంటనే వారు స్నేక్ రెస్క్యూ సభ్యులకు సమాచారం అందించారు. స్నేక్ మిత్రలు చిలువను బంధించారు. సమీప అడవిలో దాన్ని వదిలేశారు.

చిన్నారులకు స్క్రీనింగ్ పరీక్ష

జూలూరుపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వెంకటేశ్వర్లు స్క్రీనింగ్ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. డా.తేజస్వి, సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె

'స్వచ్ఛ' వాహనాల సిబ్బందికి వేతనాలివ్వాలని..: కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ వాహనాల డ్రైవర్లకు, హెల్పర్లకు మున్సిపాలిటీల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ మాట్లాడుతూ పాల్వంచ మున్సిపాలిటీలో స్వచ్ఛ భారత్ వాహనాల డ్రైవర్లు, హెల్పర్లు చెత్త సేకరించి పట్టణ శుభ్రత కోసం శ్రమిస్తున్నా.. వారికి సరైన వేతనాలు దక్కడం లేదన్నారు. నివాసాల వారు యూజర్ ఛార్జీలు సరిగా చెల్లించకపోవడంతో ఉపాధి కరవైందన్నారు. మున్సిపాలిటీ నుంచే వేతనాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే 22వ తేదీన పురపాలక కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు కె.ప్రవీణ్‌కుమార్, హుస్సేన్, పార్వతి, వెంకటేశ్వరమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న బీఎస్పీ నాయకులు

పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని..: కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యంపై రెండు నెలలకోసారి వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని 23వ వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలని కోరారు. కుక్కలు, కోతుల బెడదను నివారించాలన్నారు.

★ 16వ వార్డు న్యూ గొల్లగూడెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వేస్తున్న బోరు పనులను కౌన్సిలర్ రాజకుమారి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల వెతలపై..: కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి పది నెలలు కావస్తున్నా సమస్యల పరిష్కారానికి ఎలాంటి చొరవలేకుండా పోయిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జీఎం పర్సనల్ కవితా నాయుడికి శుక్రవారం ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. సమస్యలు పరిష్కరించాలని మందా నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్, రాజారావు, వై.వెంకటేశ్వర్లు తదితరులు కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని..: ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి ఎన్.సాయి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు విష్ణు, ప్రవీణ్, జగదీశ్ పాల్గొన్నారు.

సమరం పూరిద్దాం

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఐక్య నినాదం..: టేకులపల్లి, న్యూస్‌టుడే: కార్మికవర్గంపై ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తుల అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న పిలుపునిచ్చారు. కేటీసీలో బాడీబండ్ల జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక ఐక్యతే లక్ష్యంగా ఈ నెల 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమంలో ఇఫ్టూ సంస్థ టీయూసీఐలో విలీనం అవుతోందని అన్నారు. కార్మికవర్గం తరలిరావాలని కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి జర్పుల సుందర్, నాయకులు సాగర్, ఉపేందర్, రమేశ్, మోహన్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇల్లెందులో భారీ ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలి మాట్లాడుతూ కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు బలమైన సంఘం అవసరమని.. అందుకే టీయూసీఐలో ఇఫ్టూను విలీనం చేస్తున్నామన్నారు. బోస్, వీరన్న, శేషయ్య, గురునాథం, రఘు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలకు తరలిరండి: ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 21న, వరంగల్‌లో 25న జరిగే పీడీఎస్‌యూ యాభై వసంతాల మేఘగర్జన సభకు విద్యార్థులు తరలిరావాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు వివేక్ పిలుపునిచ్చారు. ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వర్ణోత్సవ గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, కళ్యాణ్‌రామ్, కీర్తి పాల్గొన్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ యాభై వసంతాల మేఘగర్జన సభ గోడప్రతులను టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా నాయకుడు భరత్, అరుణ్, రవితేజ, చరణ్, గౌతమి, శ్రీజ, ప్రియాంక పాల్గొన్నారు. సులానగర్ జడ్పీహెచ్ఎస్‌లో స్వర్ణోత్సవాల గోడప్రతులను పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్ప రాజేశ్ ఆవిష్కరించారు.

★ ఈ నెల 20న నర్సంపేటలో జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కం కొండలరావు, మెంతెన కొండలరావులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన అరుణోదయ ముఖ్య నాయకుల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. నర్సింగ్, వీరమల్లు, సురేశ్ పాల్గొన్నారు.



ఇల్లెందులో ప్రదర్శన నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

భాజపా సభ్యత్వ నమోదు



సభ్యత్వాల్ని అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు గ్రామీణం: పట్టణంలోని కళాసీబస్తీలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సభ్యత్వ కార్యక్రమ జిల్లా ఇన్‌ఛార్జి శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. జిల్లా మాజీ కన్వీనర్ నాళ్ల సోమసుందర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలగాని గోపీకృష్ణ, పట్టణ కన్వీనర్ మురళీకృష్ణ, జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి రజత్‌కోరి పాల్గొన్నారు.

ఉర్దూ టీచర్‌ను నియమించరూ?

ఇల్లెందు గ్రామీణం: ఇల్లెందు స్టేషన్ బస్తీలోని పాఠశాలలో రెగ్యులర్ ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయురాలు ఇక్కడ్నుంచి ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో తాత్కాలికంగా మరొకరిని నియమించారన్నారు.

సుఖ ప్రసవాల్లో పాల్వంచ సీహెచ్‌సీ భేష్

పాల్వంచ, న్యూస్‌టుడే

మన్యం ప్రాంత వాసులకు అత్యవసర సేవలు అందించడంలో పాల్వంచలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ముందు వరుసలో నిలుస్తోంది. ఆదివాసీ మహిళలకు సాధారణ కాన్పులు చేయడంలో వైద్యుల కృషి అభినందనలు అందుకుంటోంది. గర్భిణుల పట్ల సమయస్ఫూర్తితో వ్యవహరించడం, నొప్పుల బాధ తట్టుకునేలా కౌన్సెలింగ్ ఇవ్వడం, సిజేరియన్ లేకుండా మామూలు కాన్పులు చేసేందుకు చేస్తున్న ప్రయత్నం రాష్ట్రస్థాయిలో ఖ్యాతిని తెచ్చిపెట్టింది.

పాల్వంచ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) సాధారణ ప్రసవాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. కరోనా సమయంలోనూ వైరస్ భయాన్ని లెక్కచేయకుండా సుమారు వెయ్యి మందికి ఇక్కడ పురుడు పోశారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తున్న వైద్యురాలు, సిబ్బంది దవాఖానాపై మరింత నమ్మకాన్ని పెంచుతున్నారు. అత్యధికంగా ప్రసవాలు చేసిన సీహెచ్‌సీ రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచి తాజా సమీక్షలో ఉన్నతాధికారుల మెప్పును అందుకుంది. కాన్పుల్లోనే కాకుండా కుటుంబ నియంత్రణ, గర్భసంచి సంబంధ శస్త్రచికిత్సలతో ఉత్తమ సేవలందిస్తున్నారు.



సుఖ ప్రసవం చేసిన వైద్యురాలు భాగ్యలక్ష్మి

ఆసుపత్రిలో 2020 నుంచి ఇప్పటి వరకు సుమారు 5,000 కాన్పులు జరిగాయి. వీటిల్లో 3,600కి పైగా సాధారణ కాన్పులే కావడం విశేషం. వీటితో పాటు గర్భసంచి, ట్యూబెక్టమీ సర్జరీలు వెయ్యికి పైగా నిర్వహించారు. ప్రస్తుతం నెలకు 70-100 వరకు ప్రసవాలు, పదుల సంఖ్యలో ఇతర ఆపరేషన్లను వైద్య సిబ్బంది నిర్వహిస్తారు. ఇదే క్రమంలో నెలనెలా పరీక్షలకు వచ్చే గర్భిణులకు ఆరోగ్యం పరంగా తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. బలవర్ధక ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

సుఖ ప్రసవాలకు ప్రాధాన్యం: భాగ్యలక్ష్మి, ప్రసూతి నిపుణురాలు



సీహెచ్‌సీకి వచ్చే గర్భిణులంతా పేద, మధ్య తరగతి, మారుమూల గిరిజన ఆదివాసీ మహిళలే. వారికి ఆరోగ్య సంరక్షణపై సరైన అవగాహన కొరవడుతోంది. కొందరు హైరిస్క్ ఉంటున్నారు. ఇలాంటి వారికి తగిన వైద్యం అందిస్తున్నాం. మిగతా వారికి జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. చాలావరకు సుఖ ప్రసవం అయ్యేలా చూస్తున్నాం. వీలు కాని పక్షంలో జాగ్రత్తలు తీసుకుని శస్త్రచికిత్సలతో తల్లీ బిడ్డలను కాపాడుతున్నాం.

'చలో కలెక్టరేట్' ముట్టడి విజయవంతానికి పిలుపు



గంగమ్మకాలనీలో రామ్మూర్తి, నాయకుల ప్రచారం..

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 28న చేపట్టనున్న 'చలో కలెక్టరేట్' ముట్టడిని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరబోయిన రామ్మూర్తి కోరారు. రేగళ్ల పంచాయతీ, గంగమ్మకాలనీలో శుక్రవారం ప్రచారాన్ని నిర్వహించారు. గ్యారంటీల అమలు కోరుతూ ఈ నెల 15 నుంచి 27 వరకు మండల, డివిజన్ కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. బీమా, ఆడమ, గంగా, కిశోర్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలపై..



ప్రచారంలో పాల్గొన్న లక్ష్మి తదితరులు..

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో ఈ నెల 21న నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం హనుమాన్‌బస్తీలో ప్రచారం నిర్వహించారు. ప్రభాత భేరీ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి సందకూరి లక్ష్మి, వాణి, కుమారి, సరోజ పాల్గొన్నారు.